

# ఊలుటోపీ

దేవరాజు సీత

"ఒరేయ్....ఒ రే య్....ఏ మి టా మీద పడి తొక్కడం? దిగు దిగు వెధవాని."

"పోన్లెద్దురూ. మరీ అంత గట్టిగా కేకలేస్తా రేవిటీ? పిల్లాడు హడలిపోయాడు. పిల్లలకి మెల్లిగా బుజ్జగించి చెప్పాలి కానీ!" రామకృష్ణ కాస్త కోప్పడినా, నీరజ మాత్రం ముందు నుంచీ వెనకేసుకొచ్చేది.

"చూడు బాబీ! బొజ్జలో నీకొక బుజ్జి తమ్ముడున్నాడు. ఇలా మీద పడితొక్కేస్తే, మరి వాడికి నొప్పెట్టదూ? ఇలారా. నా పక్కన కూర్చో. బావుందా ఈ టోపీ" అంటూ తను అల్లుతున్న ఎర్రటి వూలుటోపీ బాబిగాడికి చూపించింది నీరజ.

ఎర్రగా, మెత్తగా కొన తేలివున్న ఆ టోపీ అంటే ఎంత ఇష్టపడిపోయాడో బాబిగాడు.

"అమ్మా! నాకోటి ఇవ్వవే!"

"అలాగే బాబీ! నీకిది సరిపోదుగా. బజార్లో మంచిదీ, ఇంతకన్నా పెద్దదీ కొనమని నాన్నగారికి చెప్దాంలే. ఏం?"


"నాన్నకి చెప్పొద్దే....కోప్పడతాడు."

మూడునెలల క్రితం జరిగిన ఈ సంఘటన, బాబిగాడు మరిచిపోలేక పోతున్నాడు.

తమ్ముడు పుట్టి ఇన్ని రోజులైనా, తనకి వూలుటోపీ, ఇలాంటి–ఎర్రటి టోపీ కొననేలేదు. 'నాన్న కోప్పడతాడు' అని అనగానే, అమ్మ వూరుకుండిపోయింది. మరి తనకి టోపీ ఎలా వస్తుంది?

తమ్ముడు పెట్టుకున్న వూలుటోపీ, ఆవేళ ఎలాగేనా మెల్లగా తీసి పెట్టుకోవాలని అనుకున్నాడు బాబిగాడు.

నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు. అమ్మ నీళ్ళు పోసుకుంటూంది. పనిమనిషి వచ్చి, తమ్ముడికి నీళ్ళు కాచి, పోసి, పడుకోబెట్టి వెళ్ళిపోయింది. ఉయ్యాల్లో తమ్ముడు బుద్ధిగా



పడుకున్నాడు.

ఇదే మంచి సమయం అనుకుని, ముక్కాలి పీట ఎక్కి, మెల్లగా చంటివాడి వూలుటోపీ విప్పడం మొదలు పెట్టాడు. మధ్య మధ్య అమ్మ వస్తోందేమో-అని, ఇటూ అటూ చూస్తూ.

ఇంతలో చంటాడు మెల్లగాకదిలి, కళ్ళు విప్పాడు. తనవేపే చూస్తున్న వాడి చిన్నారి కళ్ళు చూడగానే, బాబిగాడి మనసు ఆనందంతో పురకలు వేసింది.

"తమ్ముడూ....నేనూ! నీ వూలు టోపీ నాకోసారి ఇయ్యవూ?" మెల్లగా మెత్తగా అడిగాడు.

చంటివాడు ఎందుకో నవ్వి, పెదిమలు వుండలా చేసి, ఆవులించాడు.

"బలే బలే! తమ్ముడు టోపీ తీసుకో మంటున్నాడు" అనుకుని, టోపీ తలమీంచి లాగేడు.

మరేమైందో, వున్నట్టుండి చంటాడు కేర్ మన్నాడు. బాబిగాడు భయపడి, ఆటోపీ లాగాలా లేక అలాగే వదిలేయాలా నిర్ణయించుకోలేక, ఇటూ అటూ చూస్తుండగా, నీరజ వచ్చేసింది.

"ఒరేయ్! ఏమిట్రా నువ్వు, నిద్రపోతున్న వాడిని ఎందుకులేపావ్? అసలక్కడికి ఎందుకు వెళ్ళావ్? ఇలా రాముందు."

"అదికాదే! తమ్ముడేమో...."

"ఏదీకాదు. నిద్రపోతున్నప్పుడు వాడిదగ్గరకు వెళ్ళకు."

బాబిగాడు గత్యంతరం లేక, మెల్లగా అక్కడి నుంచి వచ్చేశాడు.

అమ్మ చంటాణ్ణి బుజ్జగించి, ఉయ్యాల వూపి, పడుకోబెట్టింది.

'వూలుటోపీ విషయం అమ్మ కూడా మరిచే పోయింది. మరి నాకు టోపీ ఎలా వస్తుంది?' ఆ ఆలోచన బాబిగాణ్ణి నిలవనియ్యలేదు.

ఏం చెయ్యాలో తోచలేదు. నాన్న వస్తే అడగాలి. "సాయంత్రం ఎప్పుడవుతుందా? నాన్న గారు ఎప్పుడు ఆఫీసునుంచి వస్తారా?" అని వీధి గుమ్మం దగ్గరే కాపలా కాశాడు బాబిగాడు.

*

నాలుగేళ్ళు పూర్తిగా నిండని బాబిగాడు, నీరజా రామకృష్ణుల తొలి సంతానం. పెళ్ళయిన రెండో సంవత్సరంలో పుట్టాడు. రామకృష్ణది కాస్త తొందరగా విసుక్కునే తత్వం. అయితే మనసు మాత్రం నవనీతం. నీరజ స్త్రీ సహజమయిన సహనంతో. బాబిగాడు ఎంత అల్లరి చేసినా విసుక్కునేది కాదు. ఇద్దరి మధ్యా అల్లారు ముద్దుగా పెరిగాడు బాబిగాడు.

అమ్మ కడుపులో, తమ్ముడు గుడుగుడు గుంచం ఆడుకుంటున్నాడనీ, ఎప్పుడో గబుక్కున తనతో ఆడుకోవడానికి వచ్చేస్తాడనీ, విన్నప్పటి నుంచీ-బాబిగాడికి సరదా మరీ ఎక్కువైంది.

అయితే, అమ్మ దగ్గర కెళ్ళి భుజాల మీద కూర్చున్నా, వీపు మీద ఎక్కి ఏనుగమ్మ ఏనుగు ఆడినా, బొజ్జమీద కూర్చున్నా, పూర్వం అమ్మా, నాన్నా ఏమీ అనేవారు కారు.

అలాంటిది, అమ్మ దగ్గరి కెళ్ళడం చూస్తే చాలు, నాన్న కేక లెయ్యడం, అక్కణ్ణుంచి పొమ్మనడం, ఒక్కొక్కసారి అమ్మకూడా విసుగ్గా తనని బొజ్జమీంచి దించేయడం – ఇవన్నీ, బాబిగాడిలో ఓ రకమైన సంచలనానికి కారణ మయ్యాయి.

'తమ్ముడు' పుట్టకుండానే, ఇలా నన్ను కసురుకుంటున్నారే, తీరా తమ్ముడు పుట్టాక, అసలు నన్ను చూడనే చూడరేమో' అనే ఆలోచన, ఆ చిన్నారి బుర్రని దొలిచేయడం ప్రారంభించింది. ఇది భరించలేక, ఒక్కడూ వంటరిగా కూర్చుని, ఏడ్చుకున్నాడు కూడా!

*

"ట్రింగ్....ట్రింగ్" అని సైకిల్ బెల్లు విని పించగానే, ఆత్రుతగా అటుచూశాడు బాబిగాడు.

"నాన్నే....నాన్న వచ్చేస్తున్నాడు. వచ్చిన వెంటనే అడిగేయాలి...." అనుకుంటూ గబగబా మెట్లుదిగి, సైకిలుకు ఎదురెళ్ళాడు.

రామకృష్ణ చేతిలో ఎర్రటి పొట్లం, దూరం నుండి బాబిగాడికి, వూలుటోపీలాగ కనబడింది. వాడి హృదయం ఆనందంతో పురకలు వేసింది.

"అరె....నాన్నకి ఎలా తెలిసిపోయింది తనకి ఎర్రటి వూలుటోపీ కావాలని! అమ్మే చెప్పి వుంటుంది, మా అమ్మ మంచి అమ్మ. మా నాన్న కూడా మంచే...." అనుకుంటూ పరుగెత్తేడు.

"ఒరేయ్....ఒరేయ్ ఏవిటా పరుగూ? పడి పోతావ్....రిక్షాలు తిరుగుతున్నాయి. లోపలి కెళ్ళిపో" కసురుకున్నాడు రామకృష్ణ.

బాబిగాడికి ఆ మాటలేమన్నా వినిపిస్తేగా? వాడి కళ్ళకి ఎర్రటోపీ తప్ప మరేం కనబడ్డంలేదు.

"నాన్నా నాన్నా అది నాకివ్వవా పట్టు కుంటానూ" అన్నాడు ఆ చేతిల్లోది అందుకోవా లనే ఆత్రుతతో.

"ఏవిటనుకున్నావిదీ? బిస్కట్లనుకున్నావా? తమ్ముడుకి చొక్కా లాగూనూ" అని సైకిలు ఎత్తి వరండాలో పెట్టాడు రామకృష్ణ.

బాబిగాడిలో ఉత్సాహం చప్పగా చల్లారి పోయింది.

"నా టోపీ సంగతి అందరూ మర్చిపోయారు. తన సంగతే ఎవరికీ అక్కర్లేదు. ఇంత పిసరు తమ్ముడికి ఇంతంత మంచి బట్టలు కొనేస్తున్నారు. నాన్న మంచివాడు కాడు. అమ్మ బట్టు అసలుం డనే కూడదు. ఛ....తమ్ముడు. వీడివల్లే అన్నీను అసలు వాడితో మాటాణ్ణే మాటాణ్ను...." అనుకున్నాడు కసిగా.

చంటివాడికి కొన్న కొత్త బట్టలు నీరజ చేతిలో పెడుతూ "కాస్త ఖరీదైనా, బావున్నాయని కొనేశాను" అన్నాడు రామకృష్ణ.

ఉయ్యాల్లో పడుకున్న చంటాడు, కాళ్ళూ చేతులూ తప తపలాడిస్తూ, కేరింతలు కొడు తున్నాడు.

నీరజ చంటివాడి పాతబట్టలు విప్పి, కొత్త బట్టలు వేసింది. బట్టలు వేస్తున్నప్పుడు, వాడి టోపీ తీసి, పక్క కుర్చీలో పెట్టింది.

"ఆ టోపీ మరిచిపోకూడదా? ఒక్కసారి సరదాగా పెట్టుకుని, ఎదురింటి రామూకి, పక్కింటి కుమారికి చూపించి వద్దునుకదా! దేవుడా, దేవుడా! మా అమ్మ ఆ టోపీ తమ్ముడికి పెట్టకుండా మరిచిపోయేట్టు చెయ్యవూ...." అని మనసులో దేవుణ్ణి ప్రార్థించాడు బాబిగాడు.

"పిల్లాడికి బట్టలు సరిగ్గా సరిపోయాయండీ.... ఎంచక్కా అమిరాయో" అంది నీరజ చంటాడి బుగ్గలు ముద్దు పెట్టుకుంటూ.

రామకృష్ణ కూడా, చంటాణ్ణి ఎత్తుకుని ముద్దాడాడు.

"నా సంగతి ఎవరికీ అక్కర్లేదు. అందరికీ తమ్ముడే కావాలి" బాబిగాడు బాధగా అను కున్నాడు.

"ఒరేయ్....బాబీ చూశావా ఈ బట్టలు.... తమ్ముడికి ఎంతో బావున్నాయ్ కదూ!" అంది నీరజ.

"బానమ్మా....తమ్ముడెంతో చక్క...." అన్నాడు బాబిగాడు. ఇదే మంచి సమయం


545

అనుకుని, తన టోపీ సంగతి చెప్దామని— "అమ్మా....ఆ ఎర్ర టోపీ...." అన్నాడు.

"ఔనుస్మా.... మరిచేపోయాను ఏదీ ఎక్కడ పెట్టాను చెప్మా..." అనుకుంటూ, అక్కడే కుర్చీలో వున్న టోపీ తీసి, చంటివాడి తలకి పెట్టింది నీరజ.

"తను చెప్పిందేవిటి? అమ్మ చేసిందేవిటి?" అనుకున్నాడు బాధగా బాబిగాడు.

తనకి ఒక టోపీ కావాలని అందరూ మరిచిపోయారు – అదీ వాడి బాధ.

"చంటివాడికి టోపీ పెడితే, బాబిగాడికి ఎంత ఇష్టమో!" అంది నీరజ రామకృష్ణతో.

"అది కాదమ్మా....నాకూ అలాంటి టోపీ కావాలి. ఆ టోపీ అంటే నాకెంత ఇష్టమో...." అందామనుకున్నాడు. తీరా చూస్తే, అక్కడ ఎవ్వరూ లేరు. రామకృష్ణ బాత్ రూం లోకి వెళ్లారు. నీరజ వంటింట్లోకి వెళ్ళింది.

చంటివాడు మాత్రం ఎర్ర టోపీలో, ఎర్రటి బట్టల్లో, గాలికి ఊగుతున్న పెద్ద ఎర్ర గులాబీలా, ఉయ్యాల్లో ఆడుకుంటున్నాడు.

*

మంచం మీద గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు రామకృష్ణ. క్రింద-అమ్మ పక్కనే దొర్లుతున్నాడు బాబిగాడు. వాడికి మెలకువ వచ్చేసింది. చంటివాడు అప్పుడప్పుడు ఉయ్యాల్లో మెల్లగా కదుల్తున్నాడు. నిద్రపోతున్నా, అలవాటు కొద్దీ, దగ్గర పెట్టుకున్న ఉయ్యాల తాడు వూరకనే లాగుతోంది నీరజ.

కళ్ళు మూసుకున్నా, తెరిచినా బాబిగాడి తలలో, ఎర్ర టోపీయే కనిపిస్తోంది. ఎంత ప్రయత్నించినా, మరి నిద్ర పట్టలేదు బాబిగాడికి.

'అమ్మా, నాన్నా – నిద్రపోతున్నారు. తమ్ముడు కూడా నిద్రపోతున్నాడు. ఇదే మంచి సమయం. ఎంచక్కా టోపీ తీసుకోవచ్చు....' ఇదీ వాడి తలలో ఆలోచన.

మెల్లగా లేచి కూర్చున్నాడు. ఇటూ అటూ చూశాడు. భయం వేసింది. రామకృష్ణ గుర్రు భయంకరంగా వినిపిస్తోంది. అయినా, టోపీమీద కోర్కె, వాడిలో మొండిధైర్యాన్ని కలగజేస్తోంది.

పక్కనుంచి లేచి, ముక్కాలిపీట వేసుకుని, ఉయ్యాల్లో చంటాడి టోపీ విప్పడం మొదలుపెట్టాడు. అది రావడం లేదు. ఓ పక్క అమ్మా నాన్నా లేచిపోతారేమో అనే భయం; ఇంకా టోపీ రాదేవిటా అనే విసుగూ–కలిసి, చికాకుతో, టోపీ తాడు పట్టుకుని గట్టిగా లాగాడు. దాంతో, చంటివాడు 'కేర్' మన్నాడు. ఆ ఏడుపుకి భయపడ్డ బాబిగాడు, ముక్కాలి పీటమీంచి కింద పడ్డాడు.

నీరజ గబుక్కున లేచి లైటు వేసింది. రామకృష్ణ విసుగ్గా "ఏమిటీ గోల అర్ధరాత్రీ...." అన్నాడు విసుగ్గా కళ్ళు తెరచి.

తండ్రీ కూడా లేచిపోయాడనే భయంతో బాబిగాడు కూడా చంటివాడితో శ్రుతి కలిపాడు– ఇంటి పెంకులెగిరిపోయేట్టు.

"నువ్విక్కడికి ఎలా వచ్చావ్‌రా? ఈ పీటే విటీ ఇక్కడుందీ?" అంది నీరజ.

బాబిగాడు మాటాల్లేదు. నీరజ రెచ్చిపోయి "ఒరేయ్....నిన్నే....మాటాడవేం?" అంది.

"మరే....మరే....తమ్ముడేం...."

"డేం లేదు, గీం లేదు....వెధవా ఈ అర్ధరాత్రి ఎందుకు లేచావ్? వాడి నిద్ర చెడగొట్టడం నీకు సరదాట్రా....భయమెలా లేకపోయిందీ నీకు" అంటూ నీరజ బాబిగాడి మీద నాలుగు కేకలేసి, చంటాణ్ని పక్కలో పడుకోబెట్టుకుని, బుజ్జగించ సాగింది.

"ఎప్పుడూ, ఎవరూ నా మాట వినరు. తమ్ముణ్నే అందరూ వూరుకో బెడతారు....ఛ.... అస్సలు వీళ్ళు మంచివాళ్ళు కారు. వీళ్ళింట్లో వుండే కూడదు...." అనుకుని, బిక్కు బిక్కు మంటూ, పక్క చేరాడు బాబిగాడు.

చంటివాడు ఎంత వూరుకో బెట్టినా వూరుకోక, గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. ముఖమంతా ఎర్రగా కందగడ్డలా ఐపోయింది. సరిగ్గా చూసేసరికి, వాడికి పెట్టిన టోపీ తాడుముడి, బిగుసుకుపోయి, గడ్డాన్ని నొక్కేస్తోంది.

"అమ్మో....అమ్మో....ఇంకేవన్నా వుందా? చంటి వెధవప్రాణాలు ఈ రాత్రి ఏమైపోను? చూశారా....బాబిగాడు ఏం చేశాడో....!" అంది నీరజ గాభరాగా.

'పుట్టిన రోజులు' శీర్షికకు పిల్లల ఛాయా చిత్రాలు పంపేవారు గమనించవలసిన ముఖ్య విషయాలు:

1. శిశువు వయసు మూడు సంవత్సరాలకు మించకూడదు.

2. ఫోటోలు కార్డ్ సైజు, లేదా క్వార్టర్ సైజుల్లో వుండాలి గాని, అంతకంటె తక్కువ సైజులో వుండకూడదు. ఫోటోలో శిశువు పూర్తి రూపం కనిపించాలి. ఫోటోలు మామూలువే పంపాలి గాని, కలర్ ఫోటోలు పంపరాదు. ఫోటో ఏదో ఒక్కటే పంపాలి గాని, రెండు మూడు రకాలైనవి పంపి, ఎన్నిక చేసుకోమనకూడదు.

3. ఫోటో వెనక శిశువు పేరు, ఊరి పేరు పెన్సిల్‌తో (తేలిగ్గా) రాయాలి. విడి కాగితం మీద మళ్ళీ శిశువు పేరు, తల్లి పేరు, చిరునామా, శిశువు పుట్టిన తేదీ (సంవత్సరం, నెలతో సహా) ఫోటో తీయించిన తేదీ రాయాలి.

4. శిశువుల ఫోటోలు, ఫోటో పంపడానికి ముందు మూడు నెలల లోగానే తీయించినవి అయి వుండాలి గాని, అంతకు ముందు ఎప్పుడో తీయించినవి కాకూడదు.

5. ప్రచురణకు స్వీకరింపబడని ఫోటోలు తిరిగి కావాలనుకున్నవారు స్టాంపులు అతికించిన కవరు (ఫోటో పట్టే సైజులో) పంపవలసి వుంటుంది. ప్రచురింపబడిన ఫోటోలు మాత్రం తిరిగి పంపబడవు.

ఈ చిన్న నిబంధనలను పాటిస్తూ, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాము.

—వ. సం.

"ఏమిటీ ఏమైందీ...." ఆత్రుతగా అడిగాడు. ఎర్రబడ్డ చంటివాడి ముఖం, ఆగని వాడి ఏడుపు చూసిన రామకృష్ణ, మంచంమీంచి దిగ్గున లేచి, బాబిగాడి దగ్గర కెళ్ళి — "ఏరా వెధవా, ఏం చేశావ్ తమ్ముణ్ణి? వాణ్ణి బ్రతకనివ్వవా ఏవిట్రా? దెయ్యంలా రాత్రిలేచి ఇదట్రా నువ్వు చేసింది? అలా లాగేస్తే వాడేమవాలనీ...." అంటూ బాబిగాడి వీపు మీద బలంగా రెండు అంటించాడు.

"ఏమిటి మీరూ....వాడికి మాత్రం ఏం తెలుసుననీ? బాగుంది వరస. నిర్వాకం చాలుగాని, ఇహ ఇప్పటికి పడుకోండి." అని మొగుణ్ణి నాలుగు కేకలేసి, బాబిగాడి వీపు తడిమింది నీరజ.

అసలే నిరాశతో, భయంతో తీరని కోరికతో బిక్కచచ్చిపోయిన బాబిగాడు మరీ గట్టిగా ఏడుపు లంకించుకున్నాడు. వీడి ఏడుపు, వస్తున్న నిద్రచెడి, చంటివాడూ బాకా అందుకున్నాడు.

"వెధవ పిల్లలు వెధవ పిల్లలాని....సుఖంగా నిద్రపోదామంటే లేదుకదా ఛ ఛ...." విసుక్కున్నాడు రామకృష్ణ.

చంటివాడి ఏడుపుతో, నీరజ బాబిగాడిని వదిలి, చంటాణ్ణి పక్కలో వేసుకుని, పాలిస్తూ వూరుకోబెట్టింది.

ఓదార్చే వాడులేక, తాను ఒంటరినై పోయాననే భయంతో, అంతా తననే అంటున్నారనే అవమానంతో – కుళ్ళి కుళ్ళి ఏడ్చి, పడుకున్నాడు బాబిగాడు.

*

"బాబిగాడు భయపడ్డట్టున్నాడు నిన్న రాత్రి. వళ్ళెలా కాలిపోతూందో చూశారా–కాస్త డాక్టర్ కి చెప్పి మరీ వెళ్ళండి ఆఫీసుకి" అంది నీరజ, ఆఫీసుకు బయలుదేరుతున్న రామకృష్ణతో.

"అలాగే...." అనేసి వెళిపోయాడు అతను.

బాబిగాడు బరువుగా కళ్ళు తెరిచి, కళ్ళల్లో నీళ్ళూరుతూండగా, బెదురు బెదురుగాచూసి, కళ్ళు మూసుకున్నాడు. కన్నీళ్ళు చెంపలమీంచి తలగడ మీదకు జారుతున్నాయి.

"అమ్మా తమ్ముడి టోపీ...." మెల్లిగా అన్నాడు కళ్ళు మూసుకునే.

"అలాగే బాబీ, తమ్ముడికి టోపీ పెడతాను బాబూ. నువ్వు కాస్త ఈ పాలు తాగు...." అంటూ, టోపీ పెట్టిన చంటివాణ్ణి ఒక చంకలో వేసుకుని, మరో చేత్తో గ్లాసు అందించింది బాబిగాడికి.

బాబిగాడు మెల్లిగా కళ్ళు తెరిచి, ఆశగా టోపీవేపు చూశాడు. వాడి కళ్ళల్లో వెలుగు మెరిసింది. పాలు అందుకోబోయాడు. చెయ్యి జారి, పాలు పక్కమీద ఒలికిపోయాయి.

"అయ్యయ్యో పక్కంతా తడిసిపోయింది గదట్రా. లే....లేచి కాస్త ఇలారా....దుప్పటి మారుస్తాను...." అంది నీరజ.

బాబిగాడు నీరసంగా లేచి, గోడకి చేరగిలబడ్డాడు. నీరజ దుప్పటి మార్చింది. మళ్ళా మరో గ్లాసు పాలు కలిపి తెచ్చింది. బాబిగాడు మూతి బిగించుక్కూచున్నాడు. అక్కర్లేదని బుర్రతోనే చెప్పాడు. నీరజ ఎంత బతిమాలినా ప్రయోజనం లేకపోయింది.

సాయంత్రానికి బాగా జ్వరం ఎక్కువై పోయింది. రామకృష్ణ వచ్చి—"డాక్టరుగారు కేంపు వెళ్ళారు. ఈ మాత్రలు ఇచ్చారు. గుండ చేసి పాలతో పట్టమన్నారు. రేపు చూడ్డానికి వస్తానన్నారు" అన్నాడు మాత్రల పొట్లం నీరజకు అందిస్తూ.

నీరజ మాత్రలు గుండచేసి, కొంచెం పాలలో కలిపి, బాబిగాడికి బలవంతాన పట్టింది. వాడు ఇముడ్చుకోలేక, భళుక్కున కక్కేశాడు.

"వెధవ....వెధవా? ఆ మాత్రం మింగలేవ్. ఇలా అయితే ఎలా తగ్గుతుందిరా...." విసుక్కున్నాడు రామకృష్ణ.

"అబ్బబ్బ .... ఏమిటా విసుగూ .... అసలే జ్వరంతో పిల్లాడు బిక్కు బిక్కుమంటూంటే, ఇలాగేనేవిటి కేకలేయడం? .... ఇంకా మాత్రలున్నాయిగా...." నీరజ బాబిగాడి గుండెరాసింది.

ఆ రాత్రి బాబిగాడి జ్వరం ఏ మాత్రం తగ్గలేదు.

"నాన్నా ఆ పొట్లం నాకివ్వవూ...."

"అమ్మా తమ్ముడి టోపీ....!"

"ఇగో కుమారీ చూశావా ఎంచక్కా నా..."

ఇలా రకరకాలుగా పలవరించడం మొదలు పెట్టాడు.

"పిల్లాడు బాగా భయపడిపోయాడండీ.... మీరు మరీను. వేలెడంత వెధవని పట్టుకుని అలాగేనా కొడతారు! ఎప్పుడు తెల్లవారుతుందో....ఎప్పుడు డాక్టరొస్తాడో...." విలవిల్లాడి పోయింది నీరజ ప్రాణం.

ఆరాత్రి బాబిగాణ్ణి, చంటాణ్ణి చెరో పక్కనా పడుకోబెట్టుకుంది నీరజ. రాత్రంతా కలత నిద్రే.

రామకృష్ణ మాత్రం మామూలుగా గుర్రుపెట్టి మంచంమీద నిద్రపోయాడు.

పక్కంతా తడి కావడంతో చికాగ్గా లేచింది నీరజ. కిటికీగుండా పల్చని తెల్లని వెలుగు పరుచుకుంటోంది. దూరంగా కాకులు అరుస్తున్నాయి.

బాబిగాడు నిశ్చలంగా నిద్రపోతున్నాడు. వాడి వేపు చూసి, ఆశ్చర్యంగా తన దృష్టి చంటివాడి వేపు తిప్పింది నీరజ. వాడి తలమీద వుండాల్సిన టోపీ, బాబిగాడి గుండెల మీద వుంది. టోపీని చేతులతో గట్టిగా అదిమి పట్టుకున్నాడు వాడు.

జ్వరం ఎలా వుందో చూద్దామని, మెడ మీద చేతులు వేసిన నీరజ, గాభరాగా — "ఏవండీ లేవండీ తొందరగా. బాబిగాడి ఒళ్ళు ఇంత చల్లగా వుందేవిటండీ...." గుడ్ల నీరు కక్కుతూ లేపింది రామకృష్ణని.

"ఏమిటే నీ గోల. కాస్తంత నిద్రపోనివ్వవ్ గదా...."

"మీ నిద్ర బంగారంగానూ .... ముందు లేవండీ...." నీరజ భర్తను బలంగా తట్టి లేపింది.

రామకృష్ణ లేచి, బాబిగాడి ఒళ్ళు తడిమి "బాబీ....ఒరే బాబీ లే అమ్మా. ఇలా ఓసారి చూడు బాబూ...." అన్నాడు భయంగా.

కళ్ళు తెరిచి చూడడానికి ఇంకా బాబిగాడిలో ఏం మిగిలుందని!!

'తమ్ముడు పుట్టడంతో, ఇంట్లో అంతా తనని మరిచిపోయారని, ఇక తన ఏ కోరికా తీరే అవకాశం లేదని, అంతా తనని నిర్లక్ష్యం చేస్తున్నారని –' బాబిగాడు అనుకున్నాడో లేదో తెలీదుగానీ, వాడి గుండెలమీద చంటాడి ఎర్ర టోపీ చూసి, నీరజ మాత్రం – "అయ్యో.... టోపీ అంటే ఎంత ఇష్టపడ్డాడో – ఆ కోరిక తీరక పసిప్రాణం ఎంత విలవిల్లాడిపోయిందో....? భగవాన్! మామూలుగా ఏదో అంటున్నారనే అనుకుంటాంగానీ, పిల్లల గుండెల్లో కొన్ని కోర్కెలు ఎంత బలంగా వుంటాయో...." అనుకుని కుమిలిపోయింది.

ఇక ఎవరెంత బాధపడినా ఏం ప్రయోజనం!